సాక్షి సూర్యాపేట

బుధవారం । 28 । జూన్ । 2023



కరెంట్ బిల్లు రూ.2.72లక్షలు

హుజూర్‌నగర్ పట్టణంలో సౌర విద్యుత్ సౌకర్యం కలిగిన ఓ ఇంటికి విద్యుత్ బిల్లు నెలలో రూ.2.72లక్షలు వచ్చింది.

- 10లో



కూరగాయల సాగుతో లాభాలు

కూరగాయల సాగుతో లాభాలు పొందొచ్చని కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం 35°/26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రీ–మెట్రిక్ ,పోస్ట్–మెట్రిక్ హాస్టళ్లల్లో 2023–24 సంవత్సరానికి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు ఏఎన్ఎంల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన అభివృద్ధి అధికారి కె.శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఆపై ఉత్తీర్ణులై ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలో 18 నెలల ఏఎన్ఎం శిక్షణ తీసుకున్న వారు అర్హులని, లేదా దానికి సమానమైన అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. గిరిజన విద్యా సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉన్న వారికి 20శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తును https://tsobmms.cgg.gov.in లో ఆన్‌లైన్‌ద్వారా జూలై 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9908986256, 9966614074 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాబ్‌మేళాకు 86 మంది హాజరు



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ఉపాధి కల్పన అధికారి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 86 మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. జాబ్‌మేళాకు రెండు ప్రైవేటు కంపెనీలు రాగా వీటిలో 320 ఖాళీలు ఉండగా 86 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరైనట్లు తెలిపారు. పదిమందిని ఎంపిక చేసి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కంపెనీల ప్రతినిదులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు సూర్యాపేటకు శ్రీజగన్నాథ రథయాత్ర రాక



సమావేశంలో పాల్గొన్న ఆలయాలు, ధార్మిక సంస్థల ఐక్యవేదిక ప్రతినిధులు

భానుపురి (సూర్యాపేట) : ఇస్కాన్ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో వారంరోజుల క్రితం అంగరంగ వైభవంగా ప్రారంభమైన శ్రీజగన్నాథ రథయాత్ర ఈనెల 29న తొలి ఏకాదశి రోజున సూర్యాపేట పట్టణానికి వస్తున్నట్లు దేవాలయాలు, ధార్మిక సంస్థల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు మీలా మహదేవ్ తెలిపారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని శ్రీభగవద్గీత మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విదేశీ భక్తులు సైతం పాల్గొంటున్న తొమ్మిది రోజుల శ్రీజగన్నాథ రథయాత్ర చివరి రోజు కార్యక్రమం సూర్యాపేటలో నిర్వహిస్తున్నందున భక్తులందరూ వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక సభ్యులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు, తోట శ్యాం ప్రసాద్, పర్వతం శ్రీధర్ కుమార్, నాగవెల్లి ప్రభాకర్, మహేశ్వరం రవిచంద్ర, పసునూరి దినేష్‌బాబు, మొరిశెట్టి రామ్మూర్తి, సతీష్ శర్మ, ఈగ దయాకర్ గుప్తా, చలమల్ల నరసింహ, సలిగంటి వీరేంద్ర, తండు దేవిక, తండు వాసవి, ఈగ వెంకటేశ్వర్లు, బైరు విజయకృష్ణ, గట్ల సోమయ్య పాల్గొన్నారు.

పీవైఎల్ మహా సభలను విజయవంతం చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వచ్చే నెల 4,5 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో నిర్వహించే పీవైఎల్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యాయని విమర్శించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం దానిని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ఈవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య, ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు గిరిబాబు, సహాయ కార్యదర్శులు వీరబోయిన రమేష్, కామల్ల సుందరయ్య, కోశాధికారి బండి రవి, సభ్యులు పొన్నం బ్రహ్మం పాల్గొన్నారు.

రెండో విడత దళితబంధు

మండలాల వారీగా వివరాలు సేకరిస్తున్న అధికారులు

- ఈ సారి ఒక్కో నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున ఎంపిక
- 4,400 కుటుంబాలకు ప్రయోజనం కలిగే అవకాశం



దురాజ్‌పల్లి (సూర్యాపేట): దళితులకు స్వయం ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం రెండో విడత అమలుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి వంద మంది లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేసిన విషయం తెలిసిందే. పైలెట్ ప్రాజెక్టుగా మొదటగా ఈ పథకాన్ని తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో అమలు చేశారు. ఇక రెండో విడతలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి 1,100 చొప్పున మొత్తం 4,400 దళిత కుటుంబాలను ఎంపిక చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

విధి విధానాలపై కసరత్తు

ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేసి దళితుల ఉన్నతికి తోడ్పడడమే పథకం ముఖ్య ఉద్దేశం. మొదటి విడతలో లబ్ధిదారులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించగా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదించారు. ఎంపిక పూర్తిగా ఏకపక్షంగా చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం రెండో విడత ఎంపికకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిసింది. ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

అక్రమాలు అరికడితేనే ప్రయోజనం

మొదటి విడతలో నియోజకవర్గానికి 100 మంది చొప్పున జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 345 మంది (తుంగతుర్తి నియోజకవర్గంలో 55 మంది నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు కేటాయింపు), అదే విధంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన తిరుమలగిరి మండలంలో 2,223 యూనిట్లు ఇలా జిల్లాలో మొత్తం 2,568 యూనిట్లు అందించారు. ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతుండగా మరి కొందరు తమ యూనిట్లను ఇతరులకు విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. ప్రయోగాత్మకంగా పథకాన్ని అమలు చేసిన తిరుమలగిర మండలంలో యూనిట్ల ఎంపిక మొదలు కొని గ్రౌండింగ్ వరకు పలు అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు దళారులుగా వ్యవహరించి లబ్ధిదారుల నుంచి యూనిట్లను కాజేసినట్లు బయటపడింది. కోదాడ నియోజకవర్గ పరిధిలోని గుడిబండలో దళితుల నుంచి 40 శాతం డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి అక్రమాలను అరికడితేనే అర్హులకు న్యాయం జరిగే అవకాశం ఉందని వివిధ వర్గాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర సర్వే ఆధారంగా..

లబ్ధిదారుల ఎంపికకు జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. మండలాల వారీగా ఎస్సీ జనాభా, కుటుంబాల సంఖ్య తదితర వివరాలు సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా సేకరిస్తున్నారు. రెండు రోజుల కిందట ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్.. అన్ని జిల్లాల కలెక్టర్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలు చేశారు. ఇప్పటికే ప్రభుత్వం జీఓ కూడా జారీ చేసింది.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది కాంగ్రెసే



కార్నర్ మీటింగ్‌కు హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు

- దళితుల భూములు లాక్కుంటున్నారు
- బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

మోతె: తెలంగాణ రాష్ట్రంలో నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సీఎల్పీనేత భట్టి విక్రమార్క అన్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం చివ్వెంల మండలం తిమ్మాపురం, చందుపట్ల గ్రామాల మీదుగా మోతె మండలం నామవరం గ్రామానికి చేరుకుంది. అనంతరం రాఘవాపురం ఎక్స్‌రోడ్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల జీవితాలకు బదులు బీఆర్ఎస్ పెద్దల జీవితాలు బాగుపడ్డాయన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్.. ప్రజాస్వామ్యంలేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. బదిలీలు, సస్పెన్షన్ల పేరిట ఉద్యోగులను ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దళిత, గిరిజనుల వ్యతిరేకి అని, దళితుడిని సీఎం చేస్తానని హామీ ఇచ్చి దగా చేశారని విమర్శించారు. దళితుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. పాలకులు దళిత బంధులో 30శాతం కమీషన్ తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చివేసి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రైతుబంధు, కేజీ టూ పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్యనందిస్తామన్నారు. ఇళ్లు లేనివారందరికీ రూ. 5లక్షలతో ఇళ్లు కట్టిస్తామన్నారు. మహిళలకు రూ.500 లకే గ్యాస్ అందిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజల సంపదను దోచుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి బంగాళా ఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో సూర్యాపేట జిల్లాలో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తమకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు బట్టి విక్రమార్కకు వినతి పత్రం అందించారు.



రాఘవాపురం క్రాస్‌రోడ్డు వద్ద మాట్లాడుతున్న భట్టి, చిత్రంలో ఆర్డీఆర్, పద్మావతి, గద్దర్, వెంకన్న

నేడు హుస్సేన్‌బాద్, మామిళ్లగూడెంలో..

కార్నర్ మీటింగ్ అనంతరం బట్టి విక్రమార్క మోతె మండల కేంద్రంలో బస చేశారు. పాదయాత్ర బుధవారం ఉదయం మోతె నుంచి బయలుదేరి హుస్సేన్‌బాద్, మామిళ్లగూడెం గ్రామాల్లో కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అక్కడి నుంచి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. ఆయన వెంట మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి, ప్రజాపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దర్, మోతె కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మాత్య నాయక్, సామ చిన వెంకటరెడ్డి, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

52.50 లక్షల మొక్కలు నాటేలా..

తొమ్మిదో విడత హరితహారానికి సన్నాహాలు



చివ్వెంలలో ఏర్పాటు చేసిన నర్సరీ

- 16 శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేలా ప్రణాళిక
- గ్రామీణ నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమానికి అధికాలు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 శాఖల ఆధ్వర్యంలో 52.50లక్షల మొక్కలు నాటాలని ఆయా శాఖలు లక్ష్యం పెట్టుకున్నాయి. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో జామ, దానిమ్మ, నేరేడు, గన్నేరు, మందార వంటి మొక్కలను పెంచి సిద్ధంగా ఉంచారు. గత ఏడాది ప్రతి శాఖకు టార్గెట్ ఇచ్చి మొక్కలు నాటాలని సూచించినా తూతూమంత్రంగా నాటి సంరక్షణ మరిచాయనే ఆరోపణలు ఉన్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సారి వంద శాతం లక్ష్యం దిశగా అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు.

శాఖలవారీగా నాటనున్న మొక్కలు ఇలా..

శాఖ	లక్ష్యం	శాఖ	లక్ష్యం
అటవీ శాఖ	6లక్షలు	మార్కెటింగ్	30వేలు
డీఆర్‌డీఏ	25 లక్షలు	ఎక్సైజ్	70వేలు
మున్సిపల్	10లక్షలు	దేవాదాయ	60వేలు
ఇరిగేషన్	3లక్షలు	ఆరోగ్య	30వేలు
ఉద్యానవన	30 వేలు	పోలీస్	30వేలు
వ్యవసాయ	30వేలు	పరిశ్రమలు	60వేలు
విద్యాశాఖ	60వేలు	సంక్షేమ	40 వేలు
ఆర్అండ్‌బీ	60వేలు	పశువైద్య	10వేలు

విజయవంతంగా నిర్వహిస్తాం



జిల్లాలో త్వరలోనే హరిత హారం కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన తేదీ నుంచి అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటుతాం. ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు ఇస్తాం. ఈ ఏడాది కాల్వలకు ఇరువైపులా బండ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటిస్తాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ

ప్రతి పంచాయతీలో 10వేలకు తగ్గకుండా..

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో ఉన్న నర్సరీలో 10 వేల మొక్కలకు తగ్గకుండా సుమారు 50లక్షలను పెంచుతున్నారు. అదేవిధంగా అటవీ శాఖ కూడా తమ పరిధిలోని నర్సరీల్లో మొక్కలను పెంచుతోంది. ఇక మున్సిపాలిటీలు కూడా మొక్కలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ మొక్కలన్నీ హరితహారం ప్రారంభం నాటికి అందుబాటులోకి వస్తాయి. తొమ్మిదో విడత హరితహారం అధికారికంగా ప్రారంభం కాకపోయినా జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 2లక్షల మొక్కలను వివిధ కార్యక్రమాల్లో భాగంగా నాటారు.

సంరక్షణపై శ్రద్ధ పెట్టేనా..

ప్రభుత్వం ఎంతో ఖర్చుపెట్టి నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతోంది. నర్సరీల్లో పెంచిన మొక్కలను హరితహారంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో నాటుతున్నా వాటిని సంరక్షించడంలో అధికారుల లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నాటిన మొక్కలన్నీ బతకడం లేదు. కొన్ని శాఖలైతే నామమాత్రంగా మొక్కలు నాటి లక్ష్యం చేరినట్లు లెక్కలు చూపుతున్నాయనే విమర్శలున్నాయి. దీంతో హరితహారం లక్ష్యం నెరవేరడంలేదు. ఈ సారైనా మొక్కల సంరక్షణపై అధికారులు పూర్తిస్థాయిలో శ్రద్ధ పెడతారో లేదో వేచిచూడాలి.

సిబ్బంది పనితీరు అభినందనీయం

- ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి



మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీదేవి

భానుపురి (సూర్యాపేట) : సంస్థ మనుగడతో పాటు ప్రయాణికులకు అందిస్తున్న సేవల్లో సిబ్బంది పనితీరు అభినందనీయమని ఆర్టీసీ నల్లగొండ ఆర్ఎం శ్రీదేవి అన్నారు. సూర్యాపేట ఆర్టీసీ డిపో గ్యాలరీలో ప్రతిభ కనబర్చిన సిబ్బందికి మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆమె హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమని, ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సిబ్బంది మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ దిశగా సంస్థ తీసుకున్న నిర్ణయాల్లో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం డిపోకు చెందిన సుమారు 8మంది సిబ్బందికి నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్టీసీ డీఎం సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కోదాడఅర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రకృతి ప్రేమికుడు అశుతోష్ పాండే అన్నారు. పర్యావరణ పరిరక్షణకు అశుతోష్ పాండే చేపట్టిన భారతదేశ యాత్ర మంగళవారం కోదాడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మొక్కలను పెంచాలన్నారు. 2022 డిసెంబర్ 4న ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో మొదలు పెట్టిన పాదయాత్ర కోదాడ చేరుకోవడం ద్వారా 4600కిలోమీటర్లు పూర్తి అయ్యిందని తెలిపారు. యాత్రతో ప్రజల్లో ముఖ్యంగా యువతలో తప్పక మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

పార్టీ విస్తరణలో కీలకంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విస్తరణలో మహిళలు కీలకంగా పనిచేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. గ్యాస్ ధరలు, విద్యుత్, ఆర్టీసీ బస్ చార్జీలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం గడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలతో పాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేవన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రజలంతా పార్టీకి అండగా నిలిచి గెలిపిస్తే గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గిస్తామని చెప్పారు. త్వరలో నిర్వహించే రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొని బహుమతులు పొందాలని సూచించారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, వేములకొండ పద్మ, నీలా పద్మ, దుర్గారాణి, తంగెళ్ల లక్ష్మి, వివిధ మండలాలకు చెందిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎస్పీకి డీజీపీ అభినందనలు



ఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ప్రశంసా పత్రం అందజేసి అభినందిస్తున్న డీజీపీ అంజనీకుమార్

సూర్యాపేట క్రైం: కొంత కాలంగా జిల్లా పోలీస్‌శాఖ మెరుగైన పనితీరుతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం నిలవడంతో ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ పనివిభాగాలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, 5ఎస్ అమలు, పెట్రోకార్, బ్లూకోట్స్, డయల్ 100, పోలీస్ స్టేషన్ల నిర్వహణ తదితర అంశాల్లో ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాగే దర్యాప్తులో ఉన్న కేసులను వేగంగా కోర్టుకు దాఖలు చేయడంలో, కేసుల్లో నేరస్తులకు శిక్షల అమలు, లోక్ అదాలత్‌లలో కేసుల పరిష్కారంలో,అనుమానితుల వేలిముద్రల తనిఖీలో జిల్లా పోలీసులు ప్రతిభ చూపారని ఆయన చెప్పారు. తాము సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నామన్నారు. పోలీసు పని విభాగాలను సిబ్బంది అందరూ సమర్థంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పలు విభాగాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడానికి సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.

స్కూళ్లకు ట్యాబ్‌లు

- 10 మంది విద్యార్థులకు ఒకటి, 165మందికిపైగా ఉంటే రెండు చొప్పున కేటాయింపు
- 655 ట్యాబ్‌లు అందించిన అధికారులు
- డిజిటల్ బోధన, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వివరాల నమోదుకు వినియోగం



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న డీఈఓ(ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): సాంకేతిక రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను విద్యాశాఖ సైతం అంది పుచ్చుకుంటోంది. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంతో పాటు పాఠశాలల సమాచారం పక్కాగా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో చిన్నారుల సామర్థ్యాల సాధనకు తొలి మెట్టు కార్యక్రమాన్ని అమలు చేసింది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు మన ఊరు–మన బడి ద్వారా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తాజాగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లాలోని 768 పాఠశాలలకు 655 ట్యాబ్‌లను అధికారులు అందించారు. స్కూల్‌లో పది నుంచి 165 మంది విద్యార్థుల వరకు ఒక ట్యాబ్, 165 కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే రెండు ట్యాబ్‌లు ఇచ్చారు.

బొమ్మలు చూపిస్తూ..

విద్యార్థుల సమాచారం, పాఠశాల వివరాలతో పాటుగా ట్యాబ్‌ల ద్వారా బొమ్మలు చూపిస్తూ ప్రయోగాత్మకంగా బోధిస్తే అర్థమవుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు పుస్తకాలను ఎస్‌సీఈఆర్‌టీ వారు ఇంటర్నెట్‌లో పొందు పరిచారు. వాటిని చూపిస్తూ ట్యాబ్‌లతో బోధన చేయనున్నారు.

ప్రతీ అంశం పొందు పర్చాలి..

జిల్లాలోని 690 ప్రాథమిక పాఠశాలల్లో 575ట్యాబ్‌లు ,78 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 80 ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. వీటిని డిజిటల్ బోధనతో పాటు విద్యార్థుల వివరాల నమోదుకు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. విద్యా శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, పురోగతి, పాఠశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ట్యాబ్‌లలో పొందు పర్చాలి. ఇప్పటి వరకు విద్యార్థుల ప్రవేశాలు, మార్కుల వివరాలు, ఉపాధ్యాయుల సమాచారం, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, మధ్యాహ్న భోజన సమాచారం, మండల విద్యా వనరుల కేంద్రంలో సీఆర్‌పీల సహకారంతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ వచ్చారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థి పాఠశాలకు వచ్చిన మొదటి రోజునే పేరు నమోదు చేసి సాధించిన మార్కులు, ప్రతిభ, పాఠశాల వదిలి వెళ్లిన తేదీ వరకు వివరాలను ఉపాధ్యాయులే ట్యాబ్‌లలో నిక్షిప్తం చేయనున్నారు. వాటితో పాటుగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలు, చైల్డ్ ఇన్ఫో, యూనిఫామ్, పుస్తకాల పంపిణీ, ప్రయాణ భత్యం, యూ డైస్ ఇలా ప్రతి అంశానికి సంబంధించిన సమాచారం సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

వివరాలు పక్కాగా ఉంటాయి



పాఠశాల సమాచారం నమోదుకు అనుకూలంగా ఈ ట్యాబ్ ఉపయోగపడుతుంది. విద్యార్థుల వివరాలు, పాఠశాల సమాచారం ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. చిన్నారులకు బొమ్మలు చూపిస్తూ బోధన చేస్తే ఆసక్తి పెరుగుతుంది. ఉపాధ్యాయులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– అశోక్, జిల్లా విద్యా శాఖ అధికారి.

క్లుప్తంగా

తిరుమలగిరిలో ట్రాక్టర్‌ బీభత్సం


పూల బండ్లను ఢీకొట్టి నిలిచిన ట్రాక్టర్‌

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరిలో మంగళవారం సాయంత్రం ఓ ట్రాక్టర్‌ బీభత్సం సృష్టించింది. తిరుమలగిరి పాత గ్రామం నుంచి మొరం లోడ్‌తో ట్రాక్టర్‌ డ్రైవర్‌ వేగంగా వస్తూ ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టాడు. ఒక్కసారిగా బ్రేక్‌ వేయడంతో ట్రాక్టర్‌ అదుపు తప్పి తొర్రూరు రోడ్డు వైపు ఉన్న పూల బండ్లను ఢీకొట్టి, పక్కనే ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ముందు ఆగి పోయింది. ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న ప్రవీణ్‌కు స్వల్పగాయాల య్యాయి. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలితే పెను ప్రమాదం కలిగేదని స్థానికులు చెప్పారు. రూ.20వేల నష్టం జరిగిందని పూలబండ్ల నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్‌

భూదాన్‌పోచంపల్లి : భూ తగాదాలో గొడ్డలితో దాడిచేసి గాయపర్చిన కేసులో నలుగురిని మంగళవారం రిమాండ్‌ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. భూదాన్‌పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెంలోని 109, 110 సర్వే నంబర్‌లో గల గ్రామానికి చెందిన ఎర్రవోల వెంకటేశ్‌, ఏనుగు మాధవరెడ్డి మధ్య కొంతకాలంగా భూ వివాదం నెలకొంది.ఈ నెల 25న వివాదంలో ఉన్న పొలాన్ని ఎర్రవోల వెంకటేశ్‌ దున్నుతుండగా, విషయం తెలిసి మాధవరెడ్డి అక్కడికి వెళ్లి వారించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరగడంతో వెంకటేశ్‌, అతని భార్య నాగమణి, కుమారుడు లింగస్వామి, అల్లుడు శ్రీకాంత్‌ కలిసి మాధవరెడ్డి, అతని భార్య బాలమణి, కారుడ్రైవర్‌ వెంకటేశ్‌తో పాటు వీరి వెంట వచ్చిన పెద్ద మనిషి లింగయ్యపై కళ్లలో కారంపొడి చల్లి, గొడ్డలి, కర్రలతో దాడి చేసి గాయపర్చారు. అలాగే కారును రాళ్లతో ధ్వంసం చేశారు. ఈ ఘటనలో మాధవరెడ్డి తలకు, అతడి భార్యకు తలపై తీవ్ర గాయం కావడంతో పాటు చేయి విరిగింది. అలాగే వెంకటేశ్‌, లింగయ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొడ్డలితో దాడికి పాల్పడిన వెంకటేశ్‌, నాగమణి, లింగస్వామి, శ్రీకాంత్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్‌

కొండమల్లేపల్లి : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్ట్‌ చేశారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్‌ రోడ్డులో గల వ్యవసాయ సబ్‌ మార్కెట్‌లో సోమవారం రాత్రి కొందరు పట్టణానికి చెందిన వ్యాపారులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని రూ.19,620 నగదు, ఐదు సెల్‌ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మృత్యువుతో పోరాటం..!

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు
- మెదడులో గడ్డకట్టిన రక్తం
- ఆపరేషన్‌కు రూ.15లక్షలు కావాలంటున్న వైద్యులు
- సాయమందించాలని పేద కుటుంబం వేడుకోలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిరామ్‌



రాజాపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు మృత్యువుతో పోరాటం చేస్తున్నాడు. మెదడులో గడ్డకట్టిన రక్తాన్ని కరిగించాలంటే ఆపరేషన్‌ తప్పనిసరి అని.. అందుకు రూ.లక్షలు ఖర్చవుతాయని వైద్యులు పేర్కొనడంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. రెక్కాడితే గాని పూట గడిచేది అంతంత మాత్రమే అని.. కుమారుడిని బతికించుకునేందుకు రూ.లక్షలు ఎక్కడి నుంచి తేచ్చేదని నిరుపేద దంపతులు కుమిలిపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన తమ్మునూరి ఆనంద్‌కు భార్య, కుమార్తె సంపూర్ణ, కుమారుడు సాయిరాం ఉన్నారు. కుమారుడికి ఏడాది క్రితం వివాహం కాగా కుమార్తె ఉన్నత విద్య అభ్యసిస్తోంది. ఆనంద్‌ కులవృత్తి (నాయీబ్రాహ్మణ) చేస్తుండగా ఇంటర్‌ వరకు చదివిన సాయిరాం తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

అత్తారింటికి వెళ్తొస్తూ..

సాయిరాం భార్య పక్షం రోజుల క్రితం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 18న సాయిరాం బైక్‌పై అత్తారింటికి వెళ్లాడు. అదే రోజు రాజాపేటకు తిరిగి వస్తుండగా చేర్యాల వద్ద బైక్‌ అదుపుతప్పి కిందపడడంతో సాయిరాం తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి చేర్పించగా పరీక్షించిన వైద్యులు మెదడులో రక్త కట్టిందని తెలిపారు. ఆపరేషన్‌ తప్పనిసరి అని, అందుకు రూ.15లక్షలు అవసరం అవుతాయని చెప్పడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాతలు స్పందించి ఆపరేషన్‌ కోసం చేయూతనందించి తమ కుమారుడిని కాపాడాలని అర్థిస్తున్నారు.

ఆర్థికసాయం చేయాలనుకున్న వారు ఆనంద్‌ ఫోన్‌ పే, గూగుల్‌ పే నంబర్‌ 8499946253

కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి




కుటుంబానికి ఆసరగా ఉంటాడనుకున్న కుమారుడు రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్నాడు. ఆపరేషన్‌ నిమిత్తం వైద్యులు రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుందని అంటున్నారు. నిరుపేదలమైన మేము ఏమీ చేయలేని పరిస్థితి. దాతలు స్పందించి మా కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి. జీవితాంతం రుణపడి ఉంటాం.

–ఆనంద్‌, మణెమ్మ సాయిరామ్‌ తల్లిదండ్రులు, రాజాపేట

దేవరకొండలో వ్యక్తి హత్య

- కొట్టి చంపినట్లు హతుడి ఒంటిపై ఆనవాళ్లు
- ఆర్థిక లావాదేవీలా.. మరో కారణమా అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఐపీఎస్‌ శేషాద్రినిరెడ్డి


దేవరకొండ : ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్‌, పోలీసులు

దేవరకొండ : దేవరకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురయ్యాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణానికి చెందిన పులిజాల చంద్రమౌళి స్థానిక సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరిగా పని చేసేవాడు. ప్రస్తుతం చంద్రమౌళి వయో భారంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. ఇప్పటికే దేవరకొండ పట్టణంలోని విష్ణు కాంప్లెక్స్‌లో సెంట్రల్‌ కిడ్స్‌వేర్‌ రెడిమేడ్‌ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్న కుమారుడు పులిజాల రఘురాములు(36) తన తండ్రి చేసే దస్తావేజు లేఖరి పనిని కొనసాగిస్తున్నాడు. బట్టల షాప్‌ను రఘురాములు భార్య శ్రీలక్ష్మి చూసుకుంటోంది.

భార్యను ఇంటి వద్ద వదిలి వెళ్లి..

రాఘురాములు సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో కిడ్స్‌వేర్‌ దుకాణాన్ని మూసివేసిన తర్వాత భార్యను బైక్‌పై ఇంటివద్ద దింపాడు. అనంతరం బయట పనుందంటూ ఇంటి నుంచి బయల్దేరాడు. రాత్రి 10 గంటల నుంచి కుటుంబ సభ్యులు రఘురాములుకు ఫోన్‌ చేసినప్పటికీ అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సమీప బంధువులతో పాటు స్నేహితులను ఆరా తీసినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. మంగళవారం ఉదయం పట్టణ శివారులో శేరిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రఘురాములు విగతజీవిగా పడి ఉన్నాడు. మార్నింగ్‌ వాకింగ్‌కు వెళ్లిన కొందరు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రఘురాములు ముఖంపై రక్తపు గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


రఘురాములు(ఫైల్‌)

ఆధారాలు సేకరించిన క్లూస్‌ టీమ్‌

నల్లగొండ నుంచి క్లూస్‌ టీమ్‌, డాగ్‌ స్క్వాడ్‌ బృందం ఘటనాస్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. జాగిలాలు పట్టణ శివారులోని తుల్జమ్మ కుంట వరకు వెళ్లి ఆగిపోయాయి. ట్రైనీ ఐపీఎస్‌ శేషాద్రిని రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికే సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు రఘురాములు ఫోన్‌ డేటాను పరిశీలిస్తున్నారు. రఘురాములును మరో ప్రాంతంలో హత్యచేసి శేరిపల్లికి వెళ్లేదారిలో పడవేసినట్లుగా అనుమానిస్తున్నారు. రఘురాములు తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డిండి సీఐ పరుశురాం తెలిపారు. హత్యకు ఆర్థిక లావాదేవీలా, మరో కారణమా అన్న దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో హోటల్‌ యజమాని మృతి

- ఒంటిపై దుస్తులు లేకుండా టిఫిన్‌ సెంటర్‌లోనే విగతజీవుడైన నిర్వాహకుడు
- మృతిపై అనుమానాలున్నాయంటూ పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు


ఆడెపు శ్రీను(ఫైల్‌)

చౌటుప్పల్‌ : అనుమానాస్పద స్థితిలో ఓ హోటల్‌ యజమాని మృతిచెందాడు. చౌటుప్పల్‌కు చెందిన ఆడెపు శ్రీను(50) పదిహేనేళ్లుగా పట్టణంలోని భాస్కర్‌ థియేటర్‌ ముందు టిఫిన్‌ సెంటర్‌ నిర్వహిస్తున్నాడు. భార్యా, పిల్లలతో స్థానికంగా నివాసం ఉంటున్నాడు. రోజువారీ మాదిరిగానే శ్రీను సోమవారం సైతం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో టిఫిన్‌ సెంటర్‌ మూసివేసి భార్య చంద్రకళతో కలిసి ఇంటికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం 4–30గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటికి వచ్చాడు. రాత్రి 10గంటలు దాటినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య చంద్రకళ భర్త సెల్‌కు ఫోన్‌ చేసినా లిఫ్ట్‌ చేయలేదు. ఫలితం లేకపోవడంతో ఆమె అర్ధరాత్రి దాటాక 2గంటలకు పక్కింటి వ్యక్తిని వెంట పెట్టుకొని టిఫిన్‌ సెంటర్‌ వద్దకు వెళ్లింది. ముందు భాగంలో ఉన్న మెయిన్‌ షట్టర్‌ మూసి ఉండడంతో వెనుక వైపున ఉన్న డోర్‌ వద్దకు వెళ్లి చూశారు. గడియ పెట్టకుండా దగ్గరకు వేసి ఉన్న తలుపులను తీసి ఇద్దరు కలిసి లోనికి వెళ్లారు. అక్కడే గదిలో ఒంటిపై దుస్తులు కూడా లేని స్థితిలో శ్రీను నేలపై బోర్లా పడిపోయి ఉన్నాడు. దుస్తులు, సెల్‌ఫోన్‌ కౌంటర్‌పై ఉన్నాయి. లోపలికి వెళ్లిన ఆ ఇద్దరు కలిసి శ్రీను శరీర భాగాలను పరిశీలించారు. ఒంటిపై గాయాలు లేకపోవడంతో అంబులెన్స్‌ను పిలిపించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డ్యూటీ డాక్టర్‌ పరీక్షించి శ్రీను అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించాడు. సంవత్సరం కాలంగా తమ టిఫిన్‌ సెంటర్‌లో పనిచేస్తున్న ఓ మహిళపై తమకు అనుమానం ఉందని చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్‌ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

హుజూర్‌నగర్‌: కడుపు నొప్పి భరించలేక ఓ వివాహిత శానిటైజర్‌ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌ పట్టణంలోని సుందరయ్య కాలానీలో పిట్టల కళావతి తన భర్త నర్సింహారావు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కళావతి కొన్నిరోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో ఈనెల 21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శానిటైజర్‌ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కళావతి సోమవారం సాయంత్రం చనిపోయింది. ఆమె భర్త పిట్టల నర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆస్పత్రిలో అంబులెన్స్‌ డ్రైవర్‌ వీరంగం

- వైద్య సిబ్బందిపై దాడి.. ఫర్నిచర్‌ ధ్వంసం
- అడ్డొచ్చిన పోలీసుల విధులకు ఆటంకం
- నిందితుడి అరెస్ట్‌.. మిర్యాలగూడలో ఘటన


నిందితుడు అక్బర్‌పాష

మిర్యాలగూడ అర్బన్‌: మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో సోమవారం రాత్రి అంబులెన్స్‌ డ్రైవర్‌ వీరంగం సృష్టించాడు. రోగిని హైదరాబాద్‌కు తరలించేందుకు అద్దెకు తన అంబులెన్స్‌ను ఎందుకు పిలవలేదంటూ ఆస్పత్రి సిబ్బందిని దూషించి, దాడిచేయడంతో పాటు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు. మిర్యాలగూడ పట్టణం డాక్టర్స్‌ కాలనీలోని ఓ ఆస్పత్రిలో రోగిని అత్యవసర చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తమకు తెలిసిన ఓ అంబులెన్స్‌ డ్రైవర్‌ను మాట్లాడుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. కొద్ది సేపటి తరువాత పట్టణానికి చెందిన మరో అంబులెన్స్‌ నిర్వాహకుడు అక్బర్‌పాష ఆస్పత్రికి చేరుకుని రోగిని తరలించేందుకు తన అంబులెన్స్‌ను ఎందుకు పిలవలేదని వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ఆస్పత్రిలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు. అడ్డు వచ్చిన ఆస్పత్రి యాజమాన్యంపై తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడి చేశాడు. దీంతో డయల్‌ 100కు కాల్‌ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న కానిస్టేబుళ్లు పగిళ్ల నాగరాజు, మాండవ సైదులు సదరు అక్బర్‌పాషను వారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్బర్‌పాష కానిస్టేబుల్‌ నాగరాజు గల్లా పట్టుకుని తీవ్ర పదజాలంతో దూషించి పక్కకు నెట్టి వేశాడు. ఆ దృశ్యాలన్నీ ఆస్పత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. విధులకు ఆటంకం కలిగించిన అక్బర్‌పాషను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన విద్యార్థిని మృతి


తేజశ్రీ (ఫైల్‌)

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామానికి చెందిన పూలమ్మ మల్లేశం దంపతుల కూతురు తేజశ్రీ(17), నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామానికి చెందిన సైదులు బైక్‌పై సోమవారం కొమురెల్లి మల్లన్న దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో జగదేవ్‌పూర్‌ మండలం మునిగడపలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తేజశ్రీకి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను 108 ద్వారా గాంధీ ఆస్పతికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మంగళవారం మృతిచెందింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ.. గురుకులంలో ఏం జరిగింది..?

- మిస్టరీగా విద్యార్థి ఆత్మహత్య
- మృతుడి స్వగ్రామం చౌటుప్పల్‌ మండలం జైకేసారంలో విషాదం


రంజిత్‌ గౌడ్‌ (ఫైల్‌)

చౌటుప్పల్‌ : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం బాటసింగారం గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చౌటుప్పల్‌ మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన విద్యార్థి పందుల రంజిత్‌గౌడ్‌ (13) మంగళవారం ఆత్మహత్య అంతుచిక్కని మిస్టరీగా మారింది. చౌటుప్పల్‌ మండలం జైకేసారం గ్రామానికి చెందిన పందుల శ్రీధర్‌–ధనమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరు కూడా డిగ్రీ పూర్తి చేశారు. కుమారుడు రంజిత్‌ ప్రస్తుతం ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి దినసరి కూలి పనులకు వెళ్తోంది. ఇద్దరు కుమార్తెల తర్వాత రంజిత్‌ జన్మించడంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. ప్రయోజకుడిని చేయాలన్న లక్ష్యంతో గురుకులంలో చదివిస్తున్నారు. అయితే, 2022–23 విద్యాసంవత్సరం వరకు రంజిత్‌ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో 7వ తరగతి చదువుకున్నాడు. చూసి వచ్చేందుకు తమకు అనువుగా ఉంటుందన్న ఆలోచనతో తల్లిదండ్రులు ఇటీవలే కుమారుడిని అబ్దుల్లాపూర్‌ మెట్‌కు మార్పించుకున్నారు. ఆ క్రమంలో సోమవారం రోజు ఉదయం తల్లి ధనమ్మ కుమారుడిని ఇంటి నుంచి తీసుకెళ్లి స్వయంగా తానే గురుకులంలో చేర్పించి వచ్చింది.

.ఒక్కరోజులోనే..

పాఠశాలలో చేర్పించి వచ్చినప్పుడు రంజిత్‌ సంతోషంగానే ఉన్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మరుసటి రోజే రంజిత్‌ ఎందుకు ఉరేసుకుని అఘాయిత్యానికి ఒడిగడతాడని, ఒక్క రోజులోనే పాఠశాలలో ఏం జరిగిందని తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు. గురుకులంలో చేర్పించి వచ్చి 24గంటలు గడవకముందే అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపించసాగారు. తాము వెళ్లేలోపే పాఠశాల నిర్వాహకులు కుమారుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. రంజిత్‌ మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు బెటాలియన్‌కు అడిషనల్‌ డీజీ రాక

నల్లగొండ క్రైం : నల్లగొండ మండలం అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌కు బెటాలియన్‌ అడిషనల్‌ డీజీ స్వాతి లక్రా బుధవారం రానున్నట్లు బెటాలియన్‌ కమాండెంట్‌ సాంబయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె పలు అభివృద్ధి పనుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని టోకరా

- ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై కేసు

మిర్యాలగూడ అర్బన్‌: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని నిరుద్యోగి నుంచి డబ్బులు వసూలు చేసి టోకరా ఇచ్చిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై మిర్యాలగూడ టుటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికిన వేములపల్లి మండలం రావులపెంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుమంగళ, నల్లగొండ వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న పాండు నాయక్‌ మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన గడ్డం భార్గవి వద్ద జనవరిలో రూ.లక్ష వసూలు చేశారు. రోజులు గడిచాక ఎఫ్‌సీఐలో అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగం ఇప్పించారు. దీంతో తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగం ఇవ్వడంపై సదరు నిరుద్యోగిని టూ టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కాగా, సదరు హెచ్‌ఎం మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ డివిజన్‌ పరిధిలోని 40మంది నిరుద్యోగుల నుంచి ఇదే తరహాలో సుమారు రూ.2కోట్లకుపైగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

బాలుడిని హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురికి రిమాండ్‌

మునుగోడు: బాలుడిని హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురిని మునుగోడు పోలీసులు అరెస్ట్‌ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సాయి, దాసరి శివకుమార్‌తో పాటు మరో మైనర్‌ అదే గ్రామానికి చెందిన శివను ఈ నెల 25న స్థానిక పాఠశాల వద్దకు పిలిపించారు. తమను గ్రామంలో హేళన చేస్తూ ఎందుకు మాట్లాడుతున్నావంటూ ముగ్గురు కలిసి శివపై ఒకరి తరువాత మరొకరు దాడి చేసి కొట్టారు.స్పృహ కోల్పోయిన శివని అదే పాఠశాలలోని మరుగుదొడ్ల గదిలో పడేసి వెళ్లిపోయారు. సాయంత్రం సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అటువైపు వెళ్లగా బాలుడి అరుపులు వినిపించడంతో వెంటనే డోర్‌ తీసి కుటుంబ సభ్యులకు సమచారం అందించాడు. కుటుంబ సభ్యులు శివని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శివ తల్లి సామవారం తన కుమారుడిని కొట్టిన మగ్గురిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి నిందుతులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 25ఏళ్ల జైలు


నిందితుడు కళ్యాణ్‌

యాదగిరిగుట్ట రూరల్‌: లైంగికదాడి కేసులో నిందితుడిని 25ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ భువనగిరి జిల్లా అదనపు జడ్జి మంగళవారం తీర్పు వెల్లడించారు. యాదగిరిగుట్ట సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని ఓ ఆశ్రమానికి చెందిన బాలికపై 2019 సంవత్సరంలో మోటకొండూర్‌ మండల కేంద్రానికి చెందిన పన్నీరు కళ్యాణ్‌ అత్యాచారం చేశాడు. ఈ విషయమై యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్‌ చేసి సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి, జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా, బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని భువనగిరి కోర్టు తీర్పు చెప్పినట్లు సీఐ వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఐఒ, ఏసీపీ నరసింహారెడ్డి, అడిషనల్‌ పీపీ, సత్యనారాయణ, సీడీఓ మహేష్‌, శ్రీనివాస్‌రెడ్డిలకు కోర్టు ప్రత్యేక అభినందనలు తెలిపిందని పేర్కొన్నారు.

యువకుడికి గాయాలు

హుజూర్‌నగర్‌: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మంగళవారం హుజూర్‌నగర్‌ పట్టణంలో చోటు చేసుకుంది. హుజూర్‌నగర్‌ మండలం లకారం గ్రామానికి చెందిన లతీఫ్‌ పట్టణంలో ఆటోలో వాటర్‌ సప్లై చేసేందుకు వచ్చాడు. స్థానిక శ్రీలక్ష్మీ థియేటర్‌కు వెళ్లే మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో అతడికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతడిని పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి


జింక పిల్లకు చికిత్స చేయిస్తున్న బీట్‌ ఆఫీసర్‌, ఎంపీటీసీ

మర్రిగూడ : కుక్కల దాడిలో జింకపిల్ల మృతిచెందింది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని దామెరబీమనపల్లి గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ భూముల్లో సంచరిస్తున్న జింక పిల్లపై మంగళవారం వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గమనించిన స్థానిక రైతులు విషయాన్ని ఎంపీటీసీ సిలివేరు విష్ణుకు తెలిపారు. వెంటనే ఆయన అటవీశాఖ అధికారులతో పాటు పశువైద్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి గాయపడిన జింక పిల్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా చికిత్స పొందుతూ మృతిచెందింది.అటవీ శాఖ బీట్‌ ఆఫీసర్‌ నవీన్‌ పంచనామా నిర్వహించిన తర్వాత జింకపిల్ల కళేబరాన్ని ఖననం చేశారు.

మిర్యాలగూడలో వ్యక్తి అదృశ్యం

మిర్యాలగూడ అర్బన్‌: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. టుటౌన్‌ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం శాంతినగర్‌లో నివాసముంటున్న చిట్యాల వీరభద్రం స్థానిక రవీంద్రనగర్‌ కాలనీలోని ఓ ఎలక్ట్రికల్‌ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19న ఉదయం వీరభద్రం షాపునకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చౌటుప్పల్‌లో విషాదం


చౌటుప్పల్‌లో ఇద్దరు పిల్లలను నీటిలో ముంచి తల్లి రాజేశ్వరి ఆత్మహత్య చేసుకోవడంతో ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు


రాజేశ్వరి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


చిన్నారులు అనిరుద్‌, హర్షవర్ధన్‌ మృతదేహాల వద్ద రోదిస్తున్న తాత నర్సింహ


ఆస్పత్రిలో రోదిస్తున్న రాజేశ్వరి తల్లి రాములమ్మ


చిన్నారుల మృతదేహాలను పరిశీలిస్తున్న చౌటుప్పల్‌ సీఐ దేవేందర్‌